# బామ్మగారి బడాయి



కుందుర్తి ఇందిరాదేవి

ఆఫీసు నుండి ఇంటికి వస్తూనే పడక్కుర్చీలో ఉసూరోమంటూ పడుకున్న పార్థుని చూసి బామ్మగారు "అలా ఉన్నావేమిట్రా పార్థూ" అని పలకరించింది లోపలి నుండి వస్తూ.

"కొంప మునిగిపోయింది బామ్మా" పార్థు దిగులుగా చూశాడు బామ్మగార్ని.

ఆవిడ కాఫీ గ్లాసు అందించి " అంత కొంప మునిగిపోయే విషయమేమిటి ?" గోడవారగా చతికిల బడింది బామ్మగారు ఆ కథా కమామిషు వినడానికి.

"రేపు మా ఆఫీసుకి మాపై ఆఫీసర్ ఎవడో తగలబడుతున్నాడు బామ్మా" పార్థుకి ఒళ్ళు మండి పోతుంటే అతి గౌరవంగా చెప్పాడు.

"అయితే..." ఈ గొడవలన్నీ పాపం బామ్మ గారికి తెలియవు. అందుకనే ఆపై ఆఫీసర్ తగల బడటానికి, మనవడి కొంప మునగటానికీ సంబంధ మేమిటో అర్థంకాలేదు.

"వాడు రేపే వస్తున్నాడు బామ్మా" పార్థు కాఫీ గడగడా త్రాగేయబోయి నోరు కాలటంతో తపేలని గ్లాసు క్రింద పెట్టేశాడు.

"అయ్యో ఆ తాగటమేమిట్రా నోరు కాలదూ."

"కాలితే కాలిందిలే బామ్మా! ఓ ప్రక్క నా ఖర్మకాలి నేను ఏడుస్తుంటే" నాలిక చుర్రు మనటంతో పార్థు ధుమ ధుమలాడుతూ అన్నాడు.

"అసలు విషయం ఏమిటో చెప్పరా తండ్రీ" బామ్మగారు దీర్ఘం తీస్తూ పరిష్కారం చేసే దాన్ని నేనుండగా నీకెందుకురా దిగులు అన్నట్టు చూసింది.

"ఏమీ లేదు బామ్మా ! రేపు మాపై ఆఫీసర్ తగలడుతున్నాడు" పళ్ళు నూరుతూ అన్నాడు పార్థు.

"అయితే" బామ్మగారికి మనవడి ధోరణేమిటో అంతుబట్టలేదు.

"రేపు ఆఫీసుకి నేను పెందరాడే వెళ్ళాలి బామ్మా. పొద్దున్నే తగలడాలి."

"ఓహో ! అదా నీ బాధ !" బామ్మగారు బోసి నోటితో నవ్వుతూ "చీకటితోనే లేచి వంట చేస్తాలేరా. దానికేం భాగ్యం" అంది.

"అయ్యో ! నువ్వెక్కడ దొరికావు బామ్మా నా ప్రాణానికి" బామ్మగారిని గుర్రుమంటూ చూశాడతను.

"అనేం కూతల్రా అబ్బీ! ముందు అసలు విషయమేమిటో చెప్పు" అంది సీరియస్‌గా ముఖం పెట్టి.

"సుజాత కూడా రేపే వస్తోంది బామ్మా."

"వస్తే......"

"స్టేషన్‌కి ఎవరు వెడతారు" పార్థుకి నిజంగానే ఏడుపు వచ్చేసింది.

"ఓరి పిచ్చి సన్నాసి. అదా నీ ఏడుపు" బామ్మగారు ఫక్కున నవ్వింది.

ఒరేయ్ నువ్వా దిగుళ్ళన్నీ పెట్టుకోకు. నామీద వదిలేసెయ్యి" అంది.

"ఎలా బామ్మా ? సుజీకి ఇల్లు తెలీదు" పార్థు తన బాధ మొరపెట్టుకున్నాడు.

"తెలీకపోతే పోనీ. నేను స్టేషన్‌కి వెళ్ళి తీసుకు వస్తాను. సరేనా ? భరోసా ఇచ్చేసింది బామ్మగారు.

"ఏమిటీ... నువ్వా ?" పార్థు ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు.

"ఏం నేనే ! ఆ మాత్రం స్టేషన్‌కి వెళ్ళి ఆ పిల్లను తీసుకురాలేమా" అంది దబాయింపుగా.

"కానీ బామ్మా... నువ్వు గుర్తుపట్టటం ...

"ఓహో ! ఆ మాత్రం తెలివి నాకు లేదను కున్నావా ! ఇలాంటి విషయాల్లో నేను అఖండురాలి నని నీకు తెలీదూ ? ఇటువంటి వ్యవహారాలు నేను చిటికలో నిర్వహించేస్తానని, మన వాళ్ళందరూ నన్ను ఎంతగా పొగుడుతారో నీకు తెలీదుట్రా."

బామ్మగారు చేటంత ముఖంతో తన ఘనత గురించి వేనోళ్ళ చాటి చెప్తుంటే పార్థు ఉక్కిరి బిక్కిరి అవుతూ "నిజమే బామ్మా ! నేను మర్చే పోయాను సుమీ"అంటూ ఉత్సాహంగా ఆ చల్లారిన కాఫీనే గడ గడా తాగేశాడు.

"ఇంతకీ ఆ పిల్ల ఎలా ఉంటుందిరా? బామ్మ గారు ఇక తన ఇంటర్‌వ్యూ బిగిన్ చేసింది.

"చచ్చామురా దేవుడా! కనీసం సుజీ ఫోటో ఒక్కటి కూడా లేదు తన దగ్గిర. ఏం ప్రేమికుడు తను. ఛీ! ఛీ! ఎంతసేపు కలల్లో పలకరించటం, ఊహల్లో ఊహించటం తప్ప కనీసం ఫోటో చూసుకుంటూ మురిసి పోదామన్న ఆలోచన కూడా తనకి ఇంత వరకూ కలగనందుకు తనను తానే తిట్టుకున్నాడు.

హఠాత్తుగా మస్తిష్కంలో మెరుపులా మెరిసింది కాలేజీ గ్రూప్ ఫోటో. అందులో సుజీ ఉందిగా!

పార్థు ఉత్సాహంగా లేచి పెట్టె అడుగు నుండి ఓ గ్రూప్ ఫోటో తీసుకొచ్చి "ఇదిగో బామ్మా. మేము కాలేజీలో ఫైనలియర్ చదివేటప్పుడు ఫేర్‌వెల్ పార్టీ రోజు తీయించుకున్న ఫోటో. ఇదిగో ఈ ఎడం వైపు నుంచి మొదటి వరుసలో మక్కల చీరకట్టుకున్న అయిదో అమ్మాయే సుజీ. బాగా చూడు బామ్మా!" అన్నాడు వ్రేలితో గుర్తు పెట్టి చూపిస్తూ.

"ఏదీ! నా కళ్ళజోడు పట్టుకురా" అంది ఆ గుంపులో ఉన్న అమ్మాయిని గుర్తుపట్టడానికి.

పార్థు రాకెట్‌లా వెళ్ళి వంటగదిలో పోపుల డబ్బా ప్రక్కన ఉన్న కళ్ళజోడు పట్టుకొచ్చాడు.

ఆ మునిమాపువేళ లైటు కాంతిలో కళ్ళజోడు సర్దుకుంటూ కళ్ళు చిట్లించి చూస్తూ "ఎవరూ ఈ లావుగా ఉన్న అమ్మాయా" అంది బామ్మగారు.

పార్థు లబలబలాడుతూ "బాబోయ్...బామ్మా నువ్వు చెప్పిన అమ్మాయి ఆండాళ్ళు. ఈ సన్నగా ఉన్న అమ్మాయి బామ్మా" అన్నాడు చిటపట లాడుతూ.

"ఎవరూ? ఈ సన్నటి పిల్లా. అదేమిట్రా ఇంత అర్భకంగా ఉంది. ఈ ఆండాళ్ళు బొద్దుగా, ఎంత ముద్దొస్తుందో చూడు" అంది మనవడి సెలక్షన్ ఏమాత్రం తనకు నచ్చనట్టు.

పార్థు చిర్రుమంటూ "బామ్మోయ్ నువ్వు సుజీ గురించి ఏమైనా అంటే నేనసలు ఊరుకోను" అన్నాడు ఉక్రోషంగా.

"ఇంకా పెళ్ళయినా కాలేదు. అలా వెనకేసు కొస్తున్నావేమిట్రా? బాగానే ఉంది వరస. కుంపటి మీద కూరేమైందో చూసి వస్తానుండు." బామ్మ గారు నవ్వుకుంటూ మెల్లిగా లేచి వంట గదిలోకి వెళ్ళింది.

పార్థు మహానందంగా ఆ ఫోటోలో ముఖం కూడా స్పష్టంగా కనిపించని సుజీని ఆపేక్షగా చూసుకుంటూ పెట్లో పెట్టేశాడు.

పెట్టె మూసెయ్యబోతుంటే ఎర్రటి చీర కనిపించింది. అది సుజీ కోసం అంతకు ముందు రోజు పార్థు ఎంతో మోజుపడి కొన్నాడు.

అయిదారు నెలల క్రితం పార్థుకి పెళ్ళి చెయ్యాలని బామ్మగారు ప్రయత్నాలు ప్రారంభించింది. పార్థు ఏ సంబంధం చూడనని పేచీపెట్టి కూర్చున్నాడు.

"వాళ్ళకి మాట ఇచ్చామురా. ఈ రోజు వెళ్ళకపోతే మనకి పరువు తక్కువ కాదూ" అని మొత్తుకుందావిడ.

"వెధవ పరువు పోతేపోయిందిలే."

"ఇదెక్కడి చోద్యంరా. పెళ్ళి చూపులక్కూడా రాలేదంటే అందరూ నిన్ను వేలెత్తి చూపరుట్రా! మీ తాతగారి పేరు నాశనం చేస్తావా. నాయనా బంగారు తండ్రి బయలుదేరరా. ఆడపిల్లలా అలా భయపడతావేమిట్రా! మగవాడివి కాదుట్రా" అంటూ బుగ్గలు నొక్కుకుంటూ, బ్రతిమాలు కుంటూ లబ్బున మొత్తుకుంది.

పార్థుకి "మగవాడివి కాదుట్రా" అనేసరికి రోషం ముంచుకువచ్చింది.

వెంటనే లేచి బట్టలు వేసుకుని బామ్మగారి వెనకే వెళ్ళాడు.

"పిల్లవాడు ఎంత బుద్ధిమంతుడో! వాళ్ళ బామ్మ చాటున అకుచాటు పిందెలా ఉన్నాడు" అని అందరూ అంటుంటే పార్థు బిక్కచచ్చిపోయి "ఛీ ఛీ! పిరికివెధవలా బామ్మ కొంగు పట్టుకుని వచ్చాను. స్టైల్‌గా నడవాల్సింది" అని మనసులో వెయ్యిసార్లు తిట్టుకున్నాడు.

బామ్మగారి ముఖం చింకిచేటంత అయింది. ఆ అమ్మాయి నచ్చిందని ఆ ముఖం చూస్తుంటేనే పార్థుకి తెలిసిపోయింది.

ఇంటికి వచ్చింతర్వాత "పార్థు ఆ పిల్ల మహా చలాకీగా ఉంది కదురా. లక్ష్మిలాగుంది కదురా! ముద్దులగుమ్మలా ఉంది కదరా" అని తెగ పొగిడేసింది.

"నాకు నచ్చలేదు. నేనసలు ఆ పిల్లను చూడలేదు. నేనా అమ్మాయిని చేసుకోను" చావు కబురు చల్లగా చెప్పేశాడు పార్థు.

"అదేమిట్రా అలా అనేశావు. వాళ్ళు మనం అడిగినంత కట్నం ఇస్తామని కూడా చెప్పారు. నీ పెళ్ళి చేసి నేను కృష్ణా, రామా అనుకుంటూ ఓ మూల పడుందామనుకుంటే ఈ విపరీత మేమిట్రా" అంటూ బామ్మగారు తల్లడిల్లిపోయింది.

"కట్నం గిట్నం జాంతానై. నేనీ పెళ్ళి చేసుకోను" కుండ బ్రద్దలుకొట్టినట్టుగా చెప్పి మంచం ఎక్కేశాడు పార్థు.

"విశేషంలాంటి సంబంధంరా పార్థూ. మీ తాతగారి పేరు నిలబెడతావనుకున్నాను" ఆవిడ సణుగుడు మొదలుపెట్టింది.

"తాతయ్య విషయం ఈ హైదరాబాద్‌లో ఎవ్వరికీ తెలియదులే బామ్మా. నువ్వేం బెంగపడకు" పార్థు ఓదార్పుగా అన్నాడు.

"అది సరేలేరా. ఈమధ్య పిల్ల వెధవలంతా ప్రేమలు, దోమలు అంటున్నారు. నువ్వుకూడా కొంపదీసి వాటి పాలబడలేదు కదా" అనుమానంగా అడిగింది బామ్మగారు.

"యు ఆర్ కరక్ట్ బామ్మా. నువ్వు నిజం చెప్పేశావు. ఎంతైనా నీ బుర్ర అమోఘం" అంటూ బామ్మగార్ని ప్రశంసించేడు.

"అవేం భ్రష్టప్పనుల్రా. మన ఇంటావంటా లేనిపనులు. వెధవ్వేషాలెయ్యకు... మీ తాతగారు..." బామ్మగారి మాటలను మధ్యలోనే తుంచేసి గట్టిగా అరిచాడు పార్థు.

"బామ్మోయ్ నేను సుజీని తప్ప ఇంకెవర్నీ పెళ్ళి చేసుకోను. నేను సుజీని ప్రేమించాను" అంటూ బామ్మగారి • గుండెల్లో ఆటంబాంబు పేల్చేశాడు.

బామ్మగారి గుండెల్లో నిజంగానే ఆటంబాంబు పేలింది మనవడి మాటలకి. దడదడలాడుతున్న గుండెలతో "ఎంత పని చేశావురా పార్థూ. ఇంతకీ ఏ కులం? కట్నం లేకపోతే పోయింది? కులమింటి పిల్లని ప్రేమించకపోయావుట్రా" అంటూ గొల్లుమంది.

కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే వారే ప్రేమలూ, గ్రట్రా అంటారని బామ్మగారు విన్నది. నిజానికి ఆవిడ నమ్మకం కూడా అదే.

బామ్మగారు దుఃఖసాగరంలో మునిగి పోయే సరికి పార్థుకి కంగారు పుట్టింది. జాలివేసింది.

మునుగులోంచి తల బైటికిపెట్టి "గట్టిగా ఏడవకే బామ్మా. సుజాత అని . మీ నారాయణస్వామి గారి మనవరాలే" అని తేల్చేశాడు.

బామ్మగారి దుఃఖం ఠక్కున ఆగిపోయింది. "ఓరినీ! నారాయణస్వామిగారి మనవరాలా. ఆమాట చెప్పావు కావేం. అబ్బో ఆయన ఎంత నిష్ఠాపరుడు. ఎంత సాంప్రదాయమైన వంశం" అని తెగమెచ్చేసు కుంది.

"అయినా సాక్షాత్తూ మీ తాతగారి పోలికలు పుణికి పుచ్చుకుని పుట్టి భ్రష్టప్పనులు చేస్తావంటే నేను మాత్రం నమ్ముతానేమిట్రా పార్థూ" అంది, అక్కడికేదో వాళ్ళ మనవడై పుట్టినందుకే మంచి బుద్ధులు వచ్చాయన్నట్టు!

పార్థు ద్విగుణీకృతోత్సాహంతో సుజీకి ఈ శుభవార్త వ్రాసేశాడు. అందులో తన బామ్మగారి ఔదార్యం ఏమిటో సుజీకి అర్థమయ్యే లాగు డజను పేజీలు వర్ణిస్తూ రాసేసేడు.

పదిహేను రోజుల క్రితం సుజీ "ఏదో ఇంటర్‌వ్యూ ఉంది. హైదరాబాద్ వస్తాను పార్థూ" అని ఉత్తరం వ్రాసింది.

పార్థు ఆనందం అవధులు దాటింది. ఆ రోజు జీతం తీసుకుని ఇంటికి రాగానే "ఆ అమ్మాయికి చీర పెట్టద్దూ" అంది బామ్మగారు.

పార్థుకి కూడా భలే సంతోషం వేసింది. బామ్మగార్ని తీసుకుని షాపింగ్‌కి బయలు దేరాడు. మనవడికి తెలియకుండా ఇంకో వంద బొడ్డున దోపుకుని వెళ్ళింది బామ్మగారు.

పార్థు దారిలోనే హెచ్చరికలు మొదలు పెట్టాడు. "బామ్మా. నాకు నచ్చిన చీర సెలక్ట్ చేస్తాను. అందులో నీ పెత్తనం ఏ మాత్రం లేదు.

## ఈజిట్ నాట్ సో!

సైన్స్ సైన్స్‌కోసమే అయితే
అది 'పాయిజన్'!
ప్రాణం నిలువునా తీస్తుంది!
సైన్స్ మనిషి కోసమే అయితే
అది 'ఆక్సిజన్'!
పోయే ప్రాణాన్ని నిలబెడుతుంది!

— డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

నువ్వు వాయిల్ చీరలు, ముతక చీరలు, వెంకటగిరి... అంటూ మొదలు పెట్టావంటే నేను ఒప్పుకోను'' అని వార్నింగ్ ఇచ్చాడు.

''డబ్బులు తక్కువ పడితే నేను వేస్తాలేరా. నువ్వాదిగులు పెట్టుకోకు'' చీర సెలెక్షన్‌లో తన పాత్ర ఉండి తీరాలన్నట్టు ఇండైరెక్టుగా చెప్పింది బామ్మగారు.

పార్థు ససేమిరా ఒప్పుకోలేదు. ''అదుగో ఆ అమ్మాయి కట్టుకెడుతుందే అటువంటి చీరే కొంటాను.'' అని తేల్చేశాడు పార్థు.

''అయితే ఆ ఒళ్ళంతా కనబడే జాకెట్ చీరలు కొంటావా ? ఆ పిల్ల ఆ చీర కట్టుకుని రోడ్డుమీద నడుస్తుందా'' బామ్మగారు రోడ్డుమీదే నిలబడిపోయి బుగ్గలు నొక్కుకుంది.

''జాకెట్ చీరె కాదు బామ్మా! జార్జెట్ చీర. అమెరికన్ జార్జెట్ చీర. ఈసారి ఎలాగైనాసరే సుజీ అలాటి చీర కట్టుకోవాలి. నువ్వు మాట్లాడకుండా నడువు. నీకెందుకదంతా'' అని కసిరాడు.

రోడ్డుమీద నడుస్తున్న జనం ఈ సంభాషణ విని నవ్వుతున్నారు.

అసలు కారణం ! పార్థుకి ఆ రంగు రంగుల అమెరికన్ జార్జెట్ చీరలంటే చాలా ఇష్టం. కానీ సుజీకి వాటిని చూస్తేనే కంపరం. 'అమ్మో ఒళ్ళంతా కనబడుతుంది' అని ఛస్తే కట్టదు

ఇప్పుడు మాత్రం కట్టుకుంటుందేమిటి ! సుజీని బతిమాలో బెదిరించో కట్టించాలని పార్థు కోరిక.

షాపులో బామ్మగారు నోరు విప్పబోనాయి పార్థు ఒప్పుకోలేదు. ''ఇంట్లో పెత్తనం మాత్రం నీది. బైట అంతా నాది'' అంటూ అధికారాలు కూడా అప్పటికప్పుడు బట్టలషాపులోనే పంచేశాడు.

''ఏమిట్రా అలా నిలబడ్డావు.''

బామ్మగారి కంఠం సైరన్‌లా మ్రోగటంతో పార్థు ఉలిక్కిపడ్డాడు. ఆ చీరని ఆప్యాయంగా తడిమి పెట్టె మూసేశాడు.

భోజనం చేసి పక్క సర్దుకుని పడుకున్నారు.

''బామ్మోయ్ ! రేపు పెందలాడే వెళ్ళు సుజీని ఊరికే గుర్తుపట్టచ్చు. నాకుమల్లే సుజీ కూడా అచ్చు వాళ్ళ తాతగారి పోలికే'' అని బామ్మగారిని ఉబ్బేస్తూ సుజాత ముక్కు, ముఖం, కళ్ళు, ఎంతందంగా నవ్వేది, ఎంత చక్కగా నడిచేది కళ్ళకుకట్టినట్టు గంటసేపు చెప్పి బామ్మగార్ని ఊదరగొట్టేశాడు.

అప్పటికే బామ్మగారికి సుజీ ఎలా ఉంటుందో అర్థమైపోయిందిలా ఉంది. ''ఓ ! నారాయణస్వామి గారు గుర్తులేకేం. ఆయనెంత ధర్మాత్ముడు. ఆ ఠీవీ . ఆ దర్జా . సింహమే అనుకో. .'' బామ్మగారు ఆ రోజులన్నీ గుర్తుకి తెచ్చుకుంటూ హరికథలు చెప్పేస్తోంది.

కానీ పార్థు ఈ లోకంలో ఉంటేగా. గట్టిగా ముసుగుతన్ని, సైరన్‌లా మ్రోగుతున్న బామ్మగారి కంఠం పొరబాటున గూడా వినిపించకుండా రెండు చెవుల్లోనూ వ్రేళ్ళు దూర్చుకుని, ఆ ఎర్రటి అమెరికన్ జార్జెట్ చీర కట్టుకుంటే సుజీ ఎలా

# బామ్మగారి బడాయి

ఉంటుందో ఊహించుకుంటూ టెక్నికలర్‌లో కలలు కంటూ నిద్రలోకి జారిపోయాడు.

*   *   *

''బామ్మా ! నేను చెప్పినవన్నీ గుర్తున్నాయిగా! ఏం ఖంగారు పడకు. సుజీ నిన్ను రెండు, మూడు సార్లు చూసిందట కూడా. జాగ్రత్త ! ఎందుకైనా మంచిది 1 గంట ముందు వెళ్ళు. ఈ వెధవర్రైళ్ళు ఎప్పుడు తగలడతాయో కూడా తెలీదు.''

పార్థు నిద్రలేచింది మొదలు బామ్మగారి వెనకాలే తిరుగుతూ పారాలు నూరిపోస్తూనే ఉన్నాడు.

ఆవిడేమో నవ్వుకుంటూ, ''అలాగేలేరా, సరే అన్నానుగా'' అంటూ సమాధానాలు చెప్తూనే ఉంది.

బామ్మగారు మినపప్పు నానబోస్తుంటే పార్థు గబగబా భోజనానికి కూర్చోబోతూ ''గారెలు చేస్తావా బామ్మా ! సుజీకి ఎంత ఇష్టమో కొంచెం ఎక్కువగా చెయ్యి'' అన్నాడు చేటంత ముఖంతో.

బట్టలు వేసుకుంటూ, బూట్లు కట్టుకుంటూ కూడా ''వెధవ ఇన్‌స్పెక్షన్ ఈ రోజే తగలడింది నా ప్రాణానికి'' అని తిట్టుకుంటూనే బామ్మగారికి అప్పగింతలు పెట్టి వెళ్ళిపోయాడు హడావిడిగా.

## ఆయువుపట్లు !

కాపీలు కొట్టడానికి సులభమే
డిక్టేట్ చెయ్యడానికీ సులభమే...
నేటి పరీక్ష పేపర్లలో బిట్లు
మార్కుల స్కోరింగుకు ఆయువుపట్లు !

- ఎన్ వి. ఆర్ సత్యనారాయణమూర్తి

పదకొండు గంటలు దాటుతుండగా కాస్త ఎంగిలిపడి, ఇంటికి తాళంవేసి, రిక్షావాడితో ఓ అర గంట బేరమాడి ఓ పావలా తగ్గించి, సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్ళింది.

ఆవిడ ఆపసోపాలు పడి వెళ్ళేసరికి ఒంటిగంట అవనే అయింది గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రానే వచ్చింది.

బామ్మగారు పడుతూ, లేస్తూ, తనని ఎవరన్నా మధ్య మధ్య తాకినప్పుడల్లా ''నీ తొందర దొంగలుదోలా ! పెద్దముండని. అలారాచుకుంటూ పోకపోతే దూరంగా నడవకూడదూ'' అంటూ కళ్ళెర్రచేసి, గట్టిగా చివాట్లేస్తూ వెళ్ళింది.

''రైల్వే స్టేషన్‌కి వచ్చేటప్పుడు మడికట్టుకుని రాకూడదు బామ్మగారూ'' ఆ కుర్రాళ్ళు బామ్మగార్ని ఎక్కిరిస్తూ వెనకేవచ్చారు.

ఏదో అనబోతున్న బామ్మగారు ఆ రద్దీలో ఆ సుజీ ఎక్కడ కనబడకుండా పోతుందోనని పెట్టె, పెట్టె వెతుకుతోంది.

అందరూ పోలో మంటూ దిగిపోతున్నారు. బామ్మగారికి కనబడే ఆడపిల్లలందరూ దాదాపు ఒకే ఫ్యాషన్‌తో, మెరుపుల్లా కనిపిస్తూ కళ్ళు జిగేల్మని పిస్తుంటే, నారాయణ స్వామిగారి రూపురేఖలున్న పిల్లను ఆదుర్దాగా వెతుకుతోంది.

''అదుగో అక్కడ అచ్చు సుజీలా లేదూ'' బామ్మగారు స్వగతంలా అనుకుంటూ అటు వెళ్ళబోయేలోపే, ఎవరో ఒకతను ఆ అమ్మాయి దగ్గరగా వచ్చి ''హల్లో నీరజా ! హౌ ఆర్‌యూ ? వాట్ ఏ ప్లెజెంట్ సర్‌ప్రైజ్'' అంటూ భుజం మీద చెయ్యివేసి పలకరించాడు.

ఆ అమ్మాయి వికసించిన ముఖంతో ''హల్లో...'' అంటూ మాట్లాడుతోంది.

''ఊ ! ఈ పిల్లకాదు. నారాయణస్వామిగారి మనమరాలంటే నిప్పులా ఉంటుంది. ఈ మిడిమిడి షోకులు ఎందుకుంటాయి. వెధవ కలికాలం'' అనుకుంటూ మళ్ళీ వెతకటంలో పడిపోయింది.

దాదాపు ప్లాట్‌ఫామ్ సగం ఖాళీ అవుతుండగా ''కొంపదీసి వెళ్ళిపోలేదుగదా. పిచ్చి సన్యాసి'' అని అనుమానం వచ్చింది.

''అయ్యో రామా ! ఆ పిల్ల మాత్రం నన్ను ఎరుగుంది కదా. నా కోసం చూడద్దూ'' అని బోలెడు చిరాకు పడిపోతూ అటూ ఇటూ వెతుకుతూ ఠక్కున ఆగిపోయింది.

కొద్ది దూరంలో పార్థు చెప్పినట్టే ఉన్న ఓ అమ్మాయి చేతిలో సూట్‌కేస్‌తో, పార్థు మోజుపడే అమెరికన్ జార్జెట్ చీరలో, ఆదుర్దాగా ఎటో చూస్తోంది.

బామ్మగారి ముఖంలో ఠక్కున ఆనందం మెరిసింది. ''ఆ అమ్మాయే సుమీ. హ కోసమే చూస్తోందిలా వుంది'' అనుకుంటూ గబగబా వెళ్ళి ''హమ్మయ్య ఇక్కడ ఉన్నావా నీ కోసం అదంతా వెతక లేక చచ్చిపోయాను'' అంది ముఖం చేటంత చేసుకుంటూ.

ఆ అమ్మాయి ఒక్క క్షణం తెల్లబోయింది.

''నన్ను గుర్తుపట్టలేదుటే. పార్థూ బామ్మని కదూ. నువ్వు నన్ను చూశావని చెప్పాడే పార్థు'' అంది కొంచెం నిష్ఠూరం మిళాయించి.

''ఓ మీరా బామ్మగారు. నేను గుర్తుపట్టలేదు'' అంటూ చప్పున వంగి దణ్ణం పెట్టింది.

దాంతో బామ్మగారి ఆనందం హిమాలయ పర్వతాలకి ఎదిగిపోయి ''మొత్తానికి నారాయణస్వామిగారి మనవరాలివని పించావు ఆ వినయం, ఆ అణుకువ. . . .. ఆ ..'' అంటూ ముసి ముసిగా నవ్వి ''వెడదాం పద. . .'' అంటూ దారి తీసింది.

సుజీ సందేహంగా నిలబడిపోయి ''మీరు......'' అంటూ ఆగిపోయింది.

బామ్మగారు సుజీ సందేహాన్ని అర్థం చేసుకున్న దానిలా ''ఓ అదా ! పార్థుడికి ఆఫీసులో అదేమిటే... ఇంజెక్షనా... అదేమిటే...'' అంది.

''ఇంజెక్షన్‌కాదు బామ్మగారు. ఇన్‌స్పెక్షన్...'' అంది సుజీ నవ్వు దాచుకుంటూ.

"...ఆ...! అదే. ఆ పెక్షనే ఏదో ఉందిట. రాలేకపోయానే అని చాలా బాధ పడుతుంటే నేను వచ్చాను'' అంటూ వివరించింది.

ఇద్దరూ రిక్షావాడితో బేరం చేసినా కుదరలేదు.

''మూడు శాల్తీలకు అయిదు రూపాయలిచ్చుకోండి'' అన్నాడు వాడు.

''కళ్ళ నిండుగా ఇద్దరం కనపడుతుంటే ముగ్గురం అంటావేం. వచ్చేటప్పుడు నేను

రూపాయికే వచ్చాను తెలుసా'' అంటూ మామ్మగారు ఎదురు డబాయించింది.

''సరే మళ్ళీ ఆ రిక్షాయే ఎక్కి ఈ పాలి ఆఠాణాకే ఎల్లండి'' అంటూ వాడువెళ్ళిపోయాడు.

సుజీ అమాయకంగా, చోద్యంగా చూస్తుంటే బామ్మగారు ఏ మాత్రం ధైర్యం కోల్పోకుండా, తన సహజ గాంభీర్యంతో ''ఈ బస్తీల్లో ఇంతే నమ్మాయ్. నీకు అంతా కొత్తగా ఉంటుందిగానీ. నాకు అలవాటేలే'' అంది.

సుజీ ఏదో అనబోతుంటే వారిస్తూ ''అప్పటికీ వాడు చెప్పనే చెప్పాడు, ఆటోలో రండని... పద'' అంటూ ఓ ఆటోవాడిని పట్టుకుంది. ఆటో బయలుదేరింది.

బామ్మగారు ఈ సమయం వృధా చెయ్యదల్చుకోలేదు. సాయంత్రం పార్థు వస్తే తనిక మాట్లాడ్డానికి ఉండదు. అందుకని మెల్లిగా గొంతు విప్పింది.

''ఇదిగో చూడమ్మాయి. నీకు కోపం వచ్చినా సరే. ఈ ఒళ్ళంతా కనబడే జాకెట్ చీర... కాదనుకుంటానే... పరేలే ఏదోటి... చీర కట్టుకుంటే ఇక గౌరవమేం ఉంటుంది ఎవరికైనా. చక్కగా ఏ వెంకటగిరినో, నేత చీరో కట్టుకుంటే ఎంత బాగుంటుంది. ఆ చీర కున్న దర్జా, డాబుసరి ఈ ఉల్లిపొర చీరలకొస్తుందా ? '' అంది.

సుజీ బాగా నచ్చింది బామ్మగారికి. ఎదురు సమాధానం చెప్పకపోవటం ఇంకా నచ్చింది. నచ్చని దల్లా అదుగో... ఆ అమెరికన్ జార్జెట్ చీరే... !

బామ్మగారి మాటలకు సుజీ ఖంగారు పడలేదు. కళ్ళెర్ర చెయ్యలేదు. ఏకీభవిస్తున్నట్టుగా ''అవును బామ్మా ! నాకు వెంకటగిరి చీరెలు, వాయిల్, నేత చీరలు, పట్టుచీరలంటేనే ఇష్టం. పార్థేమో ఇది కట్టుకోమని గొడవ... అందుకని '' అంటూ సంజాయిషీ ఇచ్చేసరికి బామ్మగారి ముఖం వెలిగిపోయింది.

''అనుకున్నానులే... అయినా సాక్షాత్తు నారాయణస్వామిగారి మనవరాలివి... ఊ ...! '' అంటూ సంతోషంగా నవ్వి

''వాడు నీ కోసమని మళ్ళీ ఈదేవతా వస్త్రమే కొన్నాడు. నీకెందుకు. నా పోపుల డబ్బాలో రెండొందలు, నా పాతట్రంకు పెట్టెలో ఓయాభై ఉన్నాయి. దర్జాగా, ఏ వెంకటగిరి చీరో, ధర్మవరమో కొంటాను'' అంది ధిలాసాగా.

''అబ్బే...'' అంటూ సుజాత సిగ్గుపడిపోయింది.

ఇద్దరూ ఇంటికి వచ్చారు. సుజీ ముఖం కడుక్కుని, ఖటావ్ వాయిల్ చీర కట్టుకుని భోజనానికి కూర్చుంది. బామ్మగారు వికసించిన ముఖంతో ''ఆడపిల్లంటే అలాఉండాలి. పెద్దవాళ్ళమాట పెడచెవిన పెట్టకుండా అలా సర్దుకుపోవాలి'' అంటూ బోలెడు సంబరపడిపోతూ కొసరి కొసరి వడ్డించింది.

సుజీ ఆవులిస్తుంటే ''బాగా అలిసిపోయావులా ఉంది. ఆ గదిలో మంచం ఉంది. వెళ్ళి పడుకో'' అంది ఆప్యాయంగా.

సుజీ వెళ్ళిపోయింది. బామ్మగారి మనసు తృప్తిగా ఉంది మనమడి కోరిక తీరుతున్నందుకూ,

## బామ్మగారి బడాయి

ముఖ్యంగా సుజీ తన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటున్నందుకూ, ఇంకా చెప్పాలంటే ఇంత పెద్ద సిటీలో తనొక్కతీ రైల్వే స్టేషన్‌కి వెళ్ళి సుజీని ఇంటికి తీసుకువచ్చినందుకూ !

ఆ ఆనందంలో రోజులా ఓ గంట నడుం వాల్చకుండానే మినప్పప్పు కడిగి రుబ్బసాగింది.

''అయ్యో బామ్మగారూ. మీరు శ్రమపడుతున్నారా. మీరు కూర్చోండి. నేను రుబ్బుతాను'' సుజీ నొచ్చుకుంటూ వచ్చింది.

ఆ అభిమానానికి ఉక్కిరిబిక్కిరి అవుతూ ''శ్రమా లేదూ. పాడూ లేదు. నువ్వు కాసేపు పడుకోలేకపోయావా'' అంది.

ఓ అరగంట అలా కూర్చుని ''సరే బాగా అలసటగా ఉంది'' అంటూ సుజీ వెళ్ళి పడుకుంది.

బామ్మగారు కమ్మగా గారెలు వండింది.

''అమ్మాయ్... వేడి వేడిగా తిందువు రా'' అంటూ సుజీని కేకేసింది. సుజీ పలకలేదు. ''పిచ్చిసన్యాసి. నిద్రపోయిందిలా ఉంది'' అనుకుంటూ రెండు గారెలు తెచ్చుకుని ముందు గదిలో కాలక్షేపంగా నములుతోంది.

అలా తింటూనే మాగన్నుగా నిద్రపోయింది.

* * *

అలా ఎంతసేపు నిద్రపోయిందో తెలీదు.

''బామ్మా, బామ్మోయ్...'' అంటూ పార్థు ఇల్లెగిరిపోయేలా కేకలు పెడుతుంటే తృళ్ళిపడి లేచింది.

పార్థు హుషారుగా లోపలికి పరిగెత్తుకొచ్చి ''బామ్మా... బామ్మా... నీకో ఆశ్చర్యకరమైన వార్త చెప్పనా...'' అన్నాడు.

బామ్మగారు లేచి నిలబడుతూ మనవడి ఆశ్చర్యం ఏమాత్రం లక్ష్యపెట్టకుండా ''సరేలేరా ! నీకు నమ్మకం కుదరలేదుగా నామీద. వెళ్ళు. వెళ్ళి ఆ గదిలో చూడు'' అంది.

పార్థు ఆశ్చర్యంగా చూస్తూ ''ఆ గదిలోనా... ఏముంది బామ్మా అందులో''అన్నాడు కుతూహలంగా.

బామ్మగారు ముసిముసిగా నవ్వుతూ ''నన్నెందుకు అడుగుతావు. నువ్వే వెళ్ళి చూడు'' అంది.

పార్థు ఆ గదిలోకి పరిగెత్తాడు. ఇంతలో చేతిలో ఎర్రటి సూట్‌కేస్ చేతబట్టుకుని ఒక అమ్మాయి లోపలికి వచ్చింది.

బామ్మగారు ఎవరూ అని పలకరించే లోపే పార్థు సుడిగాలిలా వచ్చి ''ఎవరూ లేరు బామ్మా'' అన్నాడు.

బామ్మగారు చిరాకు సూచిస్తూ ''ఎవరూ లేకపోవటమేం ! సుజీ లేదూ. అయినా ఆ పిల్ల మహ బాగానచ్చిందిరా. ఎంత నెమ్మది... ఎంత అణుకువ...'' అంటూ సంబరంగా ఏదో అనబోయింది.

బామ్మోయ్ ! పార్థు గట్టిగా అరిచేసరికి ఆవిడ అదిరిపడింది.

''సుజీ రావటమేమిటి బామ్మా. ట్రయిన్ అందలేదని సుజీ బస్సులో వచ్చింది. కొంప దొరక్క నన్ను వెదుక్కుంటూ ఆఫీసు కొచ్చింది'' అన్నాడు అసహనంగా గుమ్మంలో నిలబడ్డ అమ్మాయిని చూపిస్తూ.

బామ్మగారికి కళ్ళు తిరిగి నంతపనయింది. ''హా ! మరి ఈ సుజీ ఎవరు ?'' అంది హడలిపోయిన దానిలా.

''ఎక్కడా'' పార్థు ఆదుర్దాగా అన్నాడు.

బామ్మగారు ఏదో అనుమానం వచ్చిన దానిలా వంట ఇంట్లోకి పరిగెత్తింది. మూత తీసి, ప్రత్తి అంతా క్రిందపడేసి ఉన్న ఒత్తుల డబ్బా, చిందర వందరగా ఉన్న పోపుల డబ్బా వెక్కిరిస్తున్నాయి.

బామ్మగారు పాలిపోయిన ముఖంతో ప్రక్క గదిలోకి పరిగెత్తబోయి ఆగిపోయింది. మూత తీసిన ట్రంకు పెట్టె కనిపించి గుండె గుభేలుమని ''అమ్మో నా రెండువందలయాభయి రూపాయలు..'' అంది.

''బామ్మా. కొంప ముంచావు గదే. నా పెట్లో ఉంచిన వంద కూడా కనబడ్డంలేదు. సుజీ కోసం కొన్న చీర కూడా లేదు'' అంటూ పార్థు ఖంగారుగా పరిగెత్తుకొచ్చాడు.

అప్పటిగ్గాని బామ్మగారికి బుర్ర పనిచెయ్యలేదు. ''అదికాదురా. నువ్వు ఫోటోలో చూపించి నట్టే ఉంది. నేను సుజీనే అనుకున్నాను. మరి ఈ అమ్మాయి...'' అంటూ ఆగిపోయింది.

''చంపావు కదే బామ్మా. నీ బడాయి కాదుగానీ ఆదెవత్తో వచ్చి కొంప దోచుకుపోయింది. నాలుగు వందలు గోవిందార్పణం. '' అన్నాడు పార్థు బామ్మగారి మీద ఎగిరి పడుతూ.

ఏదో అనబోయిన బామ్మగారు, చిటపటలాడుతున్న పార్థుని, వెంకటగిరి చీర భుజాల చుట్టూ లాక్కుని, బిక్కు బిక్కు మంటూ గుమ్మంలో నిలబడ్డ సుజీని చూసి, బడాయి కాస్త జారిపోగా అచేతనంగా నిలబడి పోయింది. ★

## మట్టిమిద్దెలే సుఖం !

ఈ శతాబ్దం చివరకు ప్రపంచమంతటా అరబిలియను కొత్త గృహాలను నిర్మించవలసిన ఆవశ్యకత ఉంది. వీటిలో ఎక్కువ భాగాన్ని వర్ధమాన దేశాలలోనే నిర్మించాల్సి ఉంటుంది. అయితే కొత్త గృహాల నిర్మాణానికి తగినంత ఇటుక, కాంక్రీటు, స్టీలు లభించటం కష్టం. అందుకని గృహ నిర్మాణ నిపుణులు తమ దృష్టిని మట్టి మిద్దెలవైపు మళ్లించారు. మట్టి మిద్దెలు కొత్తవేమీ కావు. గతంలో వీటిని విరివిగా నిర్మించేవారు. ఇప్పటికీ కొన్ని దేశాలలో గ్రామీణ ప్రాంతాలలో యివి ఉపయోగంలో ఉన్నాయి. వీటి వలన మరో ఉపయోగంకూడా వుంది. ఈ గృహాలలో వేసవికాలంలో చల్లగానూ, చలికాలంలో వేడిగానూ వుంటుంది. జర్మను నిపుణులు ఆధునిక పద్ధతుల్లో మట్టితో గృహాలను నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ ఫలితాలను ఇండ్లకొరత ఎక్కువగాగల వర్ధమాన దేశాలకు అందజేస్తారు.